# శ్రీమతి రాధమ్మ

★

శ్రీ ఆదివిష్ణు

రాధమ్మ అభిమానం పూర్తిగా దెబ్బతిన్నది !

సుబయ్యశెట్టి అం లేసి మాటలంటుంటే వారు కాబట్టి సహించి ఊరుకున్నారు. అదే మరోహళ్ళయితే శెట్టి అహం కారానికీ, అతని తొందరపాటుకీ తగిన బుద్ధి చెప్పి ఉండేవారు.

మంచితనమూ, సహనమూ వారిలో మూర్తీభవించాయి గనక, సౌమ్యులు గనక బ్రతికిపోయాడు శెట్టి.

తన పిచ్చి గానీ—ఆలోచించి చూస్తే శెట్టివల్ల నేర మేమీ కనుపించదు. డబ్బు ఇవ్వవలసినవాడు, అప్పిచ్చినవాడికి లోకువే గదా ! అనుకున్న వాయిదాకి అప్పు తీర్చకపోతే అవతలి వాళ్ళు నోరు మూసుక్కూర్చోడానికి అదేమైనా ధర్మం చేసిన పైకమా ? కాదుగదా ! అతనూ చెమటోడ్చి సంపాదించినదే నాయె.

ఎవర్ననుకుని ఏం లాభం ? మాటపడవలసిన రోజొచ్చింది గనక మాటపడ్డారు.

రాధమ్మకి భర్తమీద జాలి కలిగింది.!

సమస్య లన్నింటినీ ఆయన గుప్పెట్లో దాచిపెట్టు కున్నారు. సంసారాన్ని గుట్టుగా సాగించేరు. ఇంట్లో ఏనాడూ గూడా 'ఇది లేదనే' పదానికి తావివ్వలే దాయన ! బాబు చదువూ, సావిత్రి పెళ్లీ, రాజు బి. ఏ. అతని పెళ్లీ— ఇవన్నీ ఆయ నొక్కరి చేతిమీదుగానే జరిగాయి. ఎలా జరి గాయి ?

తలుచుకుంటూంటే రాధమ్మకి భయంగా ఉంది. అందుకే వారంటే రాధమ్మకి జాలి, కొండంత గౌరవమున్నూ !

చివరి కీనాటికి వారు శెట్టికి చులక నయ్యారు.

రాధమ్మ కళ్లల్లో నీళ్ళు నిలిచాయి !

"ఇదిగో నిన్నే ! నా పెన్నేమైందో కనిపించడం లేదోయ్ ?" రాఘవరావు భార్యని పిలిచేడు.

ఆయ నప్పుడే శెట్టి మాటలు మరిచిపోయేరు కాబోలు !

"వాడు .... బాబు పట్టుకుపోయేడేమో—రాత్రి అడిగేడు కూడాను .... నిన్నే ఒకమాటిలా రావోయ్ !"

రాధమ్మ అతని గదిలోకి వెళ్లింది.

"రాత్రేమయ్యిందో తెలుసా ? వాడి పెన్ను పోగొట్టు కున్నాడు కాబోలు—'ఒకమాటు మీ పెన్నిస్తారూ !' అని అడి గేడు బాబు. లేదు పొమ్మని కసురుకున్నాను. ఇది అదను కాదనుకున్నాడో యేమొ—ఉదయం కొట్టేసి ఉంటాడు. ఇది వాడి పనే."

"అనవసరంగా వాడి నెందు కనుమానిస్తున్నారూ ! ఎక్కడ పెట్టారో జాగ్రత్తగా వెదికి చూడండి" అన్నది రాధమ్మ.

"రెండు రోజుల క్రితం వాళ్ల రాజు బాబాయిని పెన్ను కొనిపెట్టమని అడిగేడుట గూడాను"– తన అనుమానాన్ని బలపరుచుకుంటో అన్నాడు రాఘవరావు.

రాజుపేరు వినగానే రాధమ్మకి కోపం వచ్చింది.

"అతని ఖర్చులు అతనికే చాలవుగానీ వీడికో పెన్ను గూడా కొనిస్తాడా ఖర్మం."

"ఊఁ .... సర్లె .... ముందు నా పెన్నేమయ్యిందో ..." రాఘవరావు మాట పూర్తికాలేదు. లక్ష్మి గుమ్మం దగ్గర నించుంది. ఆమె చేతిలో పెన్నూ ఉంది.

"సర్సరే—నీదగ్గ రున్నదా !" అన్నాడు రాఘవరావు నవ్వుతో.

"ఉత్తరం రాద్దామని—మీ టేబిల్‌మీద పెన్నుంటే తీశాను." అన్నది లక్ష్మి.

"చూశావుగా లక్ష్మీ, మీ బావగారి హంగామా ! ఏమీ తెలుసుకోకుండానే బాబుని తిట్టేశారు."

"ఏమిటోయ్ నీ బడాయి ! వాడికి పెన్నుతో అవసరం గనక, వాడేమైనా తీశాడేమో అన్నాను. ఇది తప్పా. నువ్వు చెప్పమ్మా !"

లక్ష్మి ఏమీ మాటాడలేదు. పెన్నిచ్చి వెళ్లిపోయింది.

కోటు తొడుక్కొంటూ భార్యతో అన్నాడు రాఘవ రావు—

"ఏమిటోయ్ ! ఆపిల్ల అలాగున్నదీ ?"

"........ ........ ........ ........

"రాజాగాడు ఏమైనా అన్నాడా ? అవునవును. నేనూ గ్రహిస్తూన్నాను. ఈమధ్య వాడు బాగా మారిపోయాడు. ఆపిల్ల గురించి ఏమీ పట్టించుకోడంలేదు."

"షికార్లూ, సరదాల్తోటే అతనికి తీరుబడి ఉంటే గదూ !"

"చాల్లే ఊరుకో."

"ఒక విధంగా అతన్ని పాడుచేసింది మీరు. తల కెక్కించుకు కూర్చుంటే అతనికి ఇంటిబాధ్యతలేం తెలుస్తాయి ? ఉద్యోగం వచ్చి సంవత్సరమైనా ఒక్క కానీ ఇంట్లో యిచ్చిన పాపాన పోలేదు."

"మొదలెట్టావ్ డబ్బు గొడవ."

"ఆ శెట్టి—"

"రాధా!—" అతనికి కోపం ఒచ్చింది. "నీ కేమైనా మతి పోతోందా ? ఇలాటి విషయాలు వాడి చెవిని పడ కూడదు. వాడు పట్టి అర్భకుడు. కాకి నలుపూ, కాగితం తెలుపూ అనుకునే బాపతు. ఇవన్నీ వాడికి తెలుస్తే, మనసు పాడైపోయి పిచ్చాడిలా రోడ్లవెంట తిరుగుతాడు."

"పెళ్లయింది. తండ్రి కాబోతున్నాడు. ఇంకెప్పటి కండీ అతనికి బాధ్యత తెలిసేది ?"

"పోనీలే ! నే నున్నంతకాలమైనా వాడు నిశ్చింతగా బ్రతకనీ ! నీకు తెలీదు రాధా ! వాడు మా అమ్మకి ముద్దుల కొడుకు ! సర్లె .... ఇప్పు డివన్నీ ఎందుకూ ? అన్నట్టు ఆ పిల్లని ఒక కంట కనిపెట్టు. ఉత్తమనిషి కూడా కాదు. అవతల వాళ్ల పెద్దవాళ్లు మనల్ని నమ్ముకున్నారు .... చూడూ—నే నొహమాటా చెప్తా విను. రాజుకి ఒక నలుసు కలుగుతేనే గానీ వాడికి బాధ్యతలు తెలీవు. అంతవరకూ వా డిష్టమొచ్చినట్టు జరగనివ్వు. సరేనా ? మరి నే నొస్తాను, వేళయింది. వస్తా మరి." హడావిడిగా వెళ్లిపోయాడు రాఘవరావు. మళ్లా రాత్రికిగాని ఇంటిమొహం చూడడు. ఆయనకు విశ్రాంతి లేదు.

రాధమ్మ నిట్టూర్చింది.

ఇలాంటి మంచి మనుషులకి దేవు డెప్పుడూ సాయం చేస్తాడు. ఇంత మంచితనం అందరికీ ఉంటుందా ? రాధమ్మ తన అదృష్టానికి పొంగిపోని రోజు లేదు. కానీ—

రాధమ్మ వద్దనుకుంటూనే శెట్టిని లోలోన తిట్టు కుంది.

తన యింట్లో అడుగుపెట్టే నాటికి అత్తగారు మంచంమీద ఉన్నారు. రాజా, సావిత్రీ చిన్నపిల్లలు. పెళ్లయిన రెండేళ్లకి బాబు పుట్టాడు. అత్తగారు కన్ను మూశారు. అప్పట్నుంచీ భర్తకి బాధ్యతలు పెరిగేయి. ఆయన కాబట్టి సరిపోయింది, మరొహాళ్లయితే స్వార్థానికి లొంగి సావిత్రినీ, రాజునీ అన్యాయం చేసిఉండేవారు.

సావిత్రికి పెళ్లి చేయడంతో ఒక పెద్ద బరువు దించుకున్నట్టయింది. రాజు బి. ఎ. పాసయ్యాడని తెలీడంతో రాధమ్మ ఉబ్బి తబ్బిబ్బయింది. భర్తకి కొంత బాధ్యత తీరి నట్టు భావించింది. రాజుకి చక్కటి ఉద్యోగం ఉన్న ఊళ్లోనే దొరకడంతో ఆమె ఆనందం అవధులు దాటింది. అతని పెళ్లి వైభవంగా చేశారు.

చెట్టంత తమ్ము డుండి కూడా వారు శెట్టితో మాట పడ్డారు !

శెట్టి మాటలు మళ్లా తలపుకి రాగానే ఆమె మనసు కలతచెందింది. తెప్పరిల్లింది. గబగబా దొడ్లోకి వెళ్లింది. లక్ష్మి నీళ్లు తోడటం చూచి అదిరిపడింది రాధమ్మ.

"లక్ష్మి ! ఇలారా !"

కొంగుతో చేతులు తుడుచుకుంటూ లక్ష్మి వచ్చింది.

"నీ కెన్నిసార్లు చెప్పాలి బరువు పనులు చెయ్యొద్దని! మధ్యాహ్నం అక్కమ్మ వచ్చిన తర్వాత ఆ పనులన్నీ చూచు కుంటుందిలే ".

లక్ష్మి మాటాడకుండానే లోపలికొచ్చి కూర్చున్నది. దొడ్డి తలుపు గడియవేసి తానూ లక్ష్మి దగ్గర కొచ్చి ఆమె పక్కనే కూర్చున్నది.

"రాజా కొడుకుని ఎప్పుడు చూస్తామా అని మా అందరికీ తొందరగా ఉంది లక్ష్మి !"

లక్ష్మి మౌనంగా తల దించేసుకున్నది.

"ఆయ నంటూంటారు—వాళ్లింట్లో మొదటి కాన్పు మగపిల్లలేనుట"—రాధమ్మ మెల్లిగా నవ్వుతూ అన్నది. అప్పటికీ లక్ష్మి ఏమీ మాటాడకపోడంతో, ఆమె మొహంలోకి తిన్నగా చూచింది రాధమ్మ. తర్వాత ఆమె చేతిని తన చేతు ల్లోకి తీసుకుంటూ—

"నువ్వు గనక ఆడపిల్లని కన్నావో—అన్నదమ్ము లిద్దరి మొహాలూ వాడిపోతాయి. మా సావిత్రికి అందమైన కోడలు మాత్రం దక్కుతుంది. వాళ్ల చెల్లెలి ఆశ తీరుస్తావో, అన్నదమ్ముల కోరికనే ఖాయ పరుస్తావో ఒక్కమాట చెప్పు. వినాలని ఉంది."

అప్పటికీ లక్ష్మిలో చలనం కనుపించలేదు. రాధమ్మ కొంచెం కలతచెందింది. దగ్గిరసా జరిగి అడిగింది—

"ఈమధ్య నువ్వదోలా ఉంటున్నావు."

"....  ....  ....  ....

"ఏమీ దాచుకోవద్దు."

"....  ....  ....

"రాజా, నిన్నేమైనా అన్నాడా ? చెప్పు నాతో. అతన్ని నే కోప్పడతాను."

"....  ....  ....  ...."

"ఏడాది క్రితం అతను బాబులా చదువుకునే కుర్రాడు. ఇప్పటికీ స్నేహితులనీ, సరదాలనీ ఉంటాయిగదా. ఆ మాటకొస్తే రాజులాటి కుర్రవాళ్లందరూ యింతే."

"అదేం కాదక్కా !"

"మరింకేవిటమ్మా ! .... ఓహో, అర్థమైంది ! అదా విషయం ! పిచ్చిపిల్ల ! మనం ఆడవాళ్లం. పుట్టింటిమీద మమకారం అసహజమేమీ కాదు. ఉండు—మీ బావగార్తో చెప్పి నీ ప్రయాణానికి ఏర్పాటు చేయిస్తాను. సరా, నువ్వు మరి నవ్వాలి. నీ నవ్వు బాగుంటుందనే రాజాకి నిన్ను చేసుకోడానికి కిష్టపడ్డాను. తెలుసా. మరి నవ్వు."

"అక్కా !" లక్ష్మి కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగేయి.

రాధమ్మ గతుక్కుమంది. ఆమె గుండెల్లో భయం నిండిపోయింది. లక్ష్మి తల నిమురుతో "భయపడకు లక్ష్మీ ! మేమందరమూ ఉన్నాం. మీ బావగారు రాజా నేమీ అనరనేగాని సమయమొస్తే అతని చెవులొంచి నువ్వు చెప్పినట్టు చేయించ గలరు. ఏం జరిగిందో చెప్పమ్మా. నన్ను ఖంగారు పెట్టకు."

లక్ష్మి చెప్పింది—

"ఆయన దాచమని ఏభయి రూపాయ లిచ్చేరు. మంచి చీరేదైనా కొనిపెట్టరూ అని అడుగుతే 'ఇప్పుడు నీ సరదాలే కావలిసి వచ్చాయి. ఆ డబ్బిలా యివ్వు. పిచ్చి పిచ్చి కోరికలు"— పూర్తిగా చెప్పలేక మొహాన్ని చేతుల్లో దాచుకుని ఏడ్చింది.

రాజునీ, అతని కరుకు స్వభావాన్నీ అసహ్యించుకున్నది రాధమ్మ.

"నీకు తెలీదక్కా ! ఆ యేభై మర్నాటికి ఆయనదగ్గ రుండవ్."

రాధమ్మ రాజుమీద మండిపడింది.

"డబ్బు నిలా నీళ్లలా ఖర్చుపెడితే ముందు తన గతేంగాను ? నే మతన్ని వత్తిడి చేయడంలే దనేగా యీ దుబారా ! పొద్దున శెట్టిగారి—"

"నేనూ విన్నాను."

"శెట్టిగారి అప్పెలాగో తీరుస్తాము. కొంప తాకట్టు పెట్టో, నా నగలమ్మో ఎలాగోలా ఆ అప్పు తీరుతుంది. కానీ .... ఈమనిషి మారే దెలా ? భార్య ముచ్చటపడి చీర కొనిపెట్టమని అడుగుతే చీత్కరిస్తాడూ ? ఇలాగైతే రేపు పుట్టబోయే పిల్లవాడి కోరిక లెలా తీరుస్తాడు ? ఇతన్ని వాళ్ల నాన్నగారూ ఇలాగే పెంచారా ? అతను రానీ—నిలబెట్టి అడుగుతాను."

"వద్దక్కా. నే చెప్పినట్టు తెలుస్తే యింకా మండిపడి పోతారు." అన్నది లక్ష్మి భయంగా.

"మరెంతకాలమని నోరుమూసు క్కూర్చోమంటావ్ ? ఛ .... రాజు కెప్పుడు బుద్ధి వస్తుందిరా భగవంతుడా ? పోనీలే లక్ష్మీ ! నువ్వు బాధపడకు. మీ బావగారితో చెప్పి బ్రహ్మాండమైన చీర తెప్పిస్తాను."

"వద్దక్కా వద్దు. నన్నిలాగే ఉండనివ్వు."

లక్ష్మి లేచి తన గదిలోకి వెళ్లిపోయింది.

రాధమ్మ బాధపడ్డది. పెళ్లయిన కొత్త రోజులు ఇలాగేనా గడుస్త ? అన్నదమ్ముల మధ్య వాళ్ల అభిప్రాయాలూ, ఆచరణలూ ఉత్తర దక్షిణ ధ్రువాల దూరంలో ఉన్నా యనుకున్నది రాధమ్మ.

మధ్యాన్నం భోజనాలైన తర్వాత బాబు కాలేజీ నుంచి వచ్చేడు. వచ్చి వాళ్ల బాబాయి తనకి కొనిచ్చిన పెన్ను గురించి చాలా చెప్పేడు. అది పదిహేడు రూపాయిల పెన్నుట. వాళ్ల ప్యూనుచేత తనకి పంపించాడుట.

రాధమ్మ వినుక్కుంది. బాబు ముందే వాళ్ల బాబాయి మీద మండిపడింది. వాడిది సహించలేకపోయాడు. వాళ్లమ్మ మాట కెదురు నిలిచాడు. వాడు కాలేజీకి వెళ్లిన తర్వాత రాధమ్మ అన్నది.

"పెన్ను కొనివ్వగానే వాళ్ల బాబాయి దేవుడై పోయాడు."

—మధ్యాన్నంపూట ఒక గంటసేపైనా కన్ను మూయడం రాధమ్మకి అలవాటు. కానీ, ఆరోజు ఆమె నిద్రపోలేదు. మనసునిండా రాజు నిలిచిపోయేడు. అతని భవిష్యత్తు గురించి ఆమెకు భయంగా ఉన్నది.

అకస్మాత్తుగా ఆమెకో ఆలోచన వచ్చింది. గబగబా లక్ష్మి దగ్గరకు వెళ్లింది. గుమ్మం దగ్గరే కూర్చుని లక్ష్మిని పిలిచింది. ఈవేళప్పుడు రాధమ్మ నిద్ర మానుకుని తనని పిలవడంతో ఆశ్చర్యపడ్డది లక్ష్మి.

"రాజు మా అందరిలో ఉండటంవల్లనూ, వాళ్లన్నగారు అతనికి బాధ్యతలేమీ అప్పగించకపోవడంలోనూ అతనిలా విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నాడు. నిజమంటావా ?"

లక్ష్మి తలూపింది.

"నువ్వు నన్ను అపార్థం చేసుకోనంటే నీకో సలహా చెప్తాను. చేస్తావా ?"

"....   ....   ...."

"తప్పనిసరైతే—అతని బాగుకోసం మన మేదైనా సరే చేసితీరాలి. ఇవ్వాళ మనం ఒక చిన్న నాటక మాడదాం."

"నాటకమా !"

రాధమ్మ ఫకాలున నవ్వేసింది—

"మరే. నిజంగా నాటకమే. రాజా యింటికి రావడం చూచి, నువ్వూ నేనూ తగాదా పెట్టుకుందాం."

"తగాదానా ?" మరింత ఆశ్చర్యపోయింది లక్ష్మి.

"వేరింటి కాపురం కావాలనుకుంటే, అది ఆడవాళ్ల వల్లనే చాతనవుతుంది. దీన్లో కొంచెం నీ సహాయం అవసరం"

"అక్కా !"

మళ్లా నవ్వేసింది రాధమ్మ.

"పిచ్చిపిల్లా ! భయపడకు. రాజా బాగుపడాలంటే, అతనికి బాధ్యతలు తెలియాలంటే ఇది చాలా మంచి పద్ధతి."

"నువ్వు చాలా చిత్రంగా మాటాడుతున్నా వక్కా! వారికి వారై తెలుసుకోవాలే గాని ఇలా వేరుపడటాలూ నా బొందిలో ప్రాణముండగా జరుగకూడదు. నీలాటి దేవత నొదిలి దూరంగా బ్రతకడం నా చాతకాదు." అన్నది లక్ష్మి గాద్గదికంగా.

రాధమ్మ కరిగిపోయింది. లక్ష్మిని హృదయానికి హత్తుకున్నది. ఆమెను బుజ్జగించింది. అక్కడ్నుంచి లేచి వచ్చేస్తూ అనుకుంది—

"ఇంతమంచి పిల్లనా రాజుకోసం దూరం చేసుకోవాలని నేను ఆలోచిస్త !"

—మూడు గంటలకి కాఫీ తాగిన తర్వాత అప్పుడే వచ్చిన సావిత్రి ఉత్తరం చదివింది రాధమ్మ.

"ప్రియమైన అమ్మాజీ !

లోగడ నేను రాసిన ఉత్తరానికి జవాబు రాయనే లేదు. ఈ ఉత్తరానికైనా జవాబు వ్రాస్తావని తలుస్తాను. సంక్రాంతి పండుగకు మేము మీ తావుకి రావలయుననుకుంటున్నాము. కావున మీరు తగు జాగ్రత్తలు తీసుకొనగలరు.

పెద్దన్నయ్య ఆరోగ్యం ఎలా ఉన్నది ? మొన్నొనాడు నిద్రలో అన్నయ్య గురించి కలవరించానుట. దాంతో వారు యిప్పటికీ నన్ను గేలి చేస్తూనే ఉన్నారు. అన్నయ్య నెప్పుడు చూస్తానా అని తొందరగా ఉంది. ఆ వచ్చే సంక్రాంతి త్వరగా రాకూడదూ ? చిన్నొదిన సంగతు లేమిటి ? ఆవిడ ఆరోగ్యం జాగ్రత్త అని చెప్పవలెను. రాజన్నయ్యకి మంచీ చెడూ తెలియవు.

చిరంజీవి భాస్కరం యిప్పుడిప్పుడే అల్లరి చేస్తున్నాడు. తాత, అక్క అంటున్నాడు. వాడిని అన్నయ్యలకు చూపించాలని తొందరగా ఉన్నది. బాబు చదువెలా ఉన్నది. వాడి పరీక్షల్లో పాసైతే మంచి బహుమానం యిస్తానని చెప్పవలెను. ఇంతే సంగతులు—

సావిత్రి.

రాధమ్మ లక్ష్మితో అన్నది—

"ఈ ఉత్తరం చదువు. సావిత్రి మనసెంత మంచిదో తెలుస్తుంది. నిజం లక్ష్మీ—మగపిల్లల కంటె ఆడపిల్లలకే మమకారం ఎక్కువ."

"అవుతే—సంక్రాంతికి ఆవిడగారి అల్లరి ఒక ప్రత్యేక తన్నమాట" అన్నది లక్ష్మి చిన్నగా నవ్వుతో.

రాధమ్మ కూడా నవ్వేసింది.

నువ్వు చూస్తావ్‌గా—వసపిట్టలా ఇరవైనాలుగ్గంటలూ ఖబుర్లు. ఆమె చేసిన వంకాయ కూర మొదలుకొని, వాళ్లాయన చేయించిన నెక్లెసు వరకూ చెప్పిందే చెపుతుంది. పసిపిల్లలా నన్నొదిలి క్షణమైనా ఉండలేదు. సావిత్రే కాదు. మొన మొన్నటి వరకూ రాజా అంతే—"

రాజా విషయం వచ్చేసరికి, క్షణం క్రితం లక్ష్మికున్న ఉత్సాహం చప్పున చల్లారిపోయింది. ఇది గమనించి రాధమ్మ నొచ్చుకుంది.

—ఆరోజు రాత్రి ఎనిమిది గంటలకుగాని రాజు ఇంటికి రాలేదు. బైట సైకిలు దిగి 'అమ్మాజీ' అని పిలిచేడు. ఆ పిలుపుతో గుమ్మం వరకూ వెళ్లిన రాధమ్మ మళ్లా వెంటనే వెనక్కు తిరిగి గబగబా తన గదిలోకి వెళ్లిపోయింది. ఇది గమనించేడు రాఘవరావు. ఇప్పటివరకూ రాధమ్మ తనకి బోధించిన తమ్ముని వైనం జ్ఞాపకాని కొచ్చింది. కళ్లజోడు తీసి మొహాన్న యింత కోపం పులుంకుని గుమ్మంవైపు చూసేడు. సైకిలు గోడ కానిస్తూ అన్నయ్య నుద్దేశించి—

"అమ్మాజీ ఏది ?" అని అడిగేడు.

"చాలా పెందరాళే వచ్చావోయ్"—దెప్పి పొడిచేడు రాఘవరావు.

"ఇవ్వాళ ఆఫీసుపని హడావిడిగా ఉంది. అమ్మాజీ ఎక్కడ ?"

"నాకు తెలీ కడుగుతాను. అంతెక్కువ పని ఏడ్చిందేవిట్రా మీ ఆఫీసులో ?"

"లాస్ట్‌వీక్ కదూ ! స్టేటుమెంట్సు డ్రాఫ్టు చెయ్యాల్సి వచ్చింది."

తమ్ముడు చెప్పేదాంట్లో నిజం లేకపోలేదని సమాధాన పడ్డాడు, రాఘవరావు.

"అయినా నీ పద్ధతేం బాగోలేదురా అబ్బీ!" అన్నాడు నిష్ఠూరంగా.

తేలిగ్గా నవ్వినట్టు మొహంలో మార్పు తెచ్చుకున్నాడు రాజు.

"సర్లే. ముందు భోజనం చెయ్యి. ఇదిగో రాజు వచ్చాడోయ్!" అనేశాడు యధాలాపంగా. తర్వాతగాని గుర్తుకు రాలేదు. ఇంట్లో ఆడవాళ్లు రాజుపైన సాగించ బోయే దండయాత్ర. వెంటనే మాట మార్చి—

"మీ వదిన నీమీద కారాలూ, మిరియాలూ నూరు తోంది."

"ఎందుకనిట?"

"ఏమో. ఆవిడ్నే అడుగు" ఆ విషయంలో తనకేమీ సంబంధం లేనట్టు మళ్లా కళ్లజోడు పెట్టేసుకుని సీరి యస్‌గా పేపరు చదివేస్తున్నాడు రాఘవరావు.

మానులా నుంచుండిపోయాడు రాజు. తలుపుచాటుగా నిలబడ్డ లక్ష్మి తన కంట పడ్డది.

"అమ్మాజీ!" మళ్లా పిలిచేడు.

"ఏవిటా గావు కేకలూ? వింటూన్నవాళ్లకి చెవు డొచ్చిం దనుకున్నావా?" కోపంగానే అనేసింది రాధమ్మ గది నుంచి బయటి కొస్తూ.

రాజు కిది కొత్తనిపించింది.

"మరేంలేదు. నాకు ప్రమోష నొచ్చింది." అనేశాడు గభాలున.

పేపరు చదువుతూన్న అన్నయ్యా, తలుపుచాటున నిల బడ్డ లక్ష్మి, రాధమ్మా, బాబూ అందరి మొహాల్లోనూ ఆనందం మెరిసింది.

"నేనీ శుభవార్త చెప్పడానికొస్తే మీరేమో ...." చిన్న బుచ్చుకుంటో అన్నాడు రాజు.

"అబ్బే! అదేం కాదురా! మీ వదినకి ...." అన్న య్యేదో సర్ది చెప్పబోయాడు గానీ అంతలోనే రాధమ్మ అతని మాట కడ్డుపడింది.

"నే నొకటి చెప్తాను విను రాజు! నీకు ప్రమోష నొచ్చిందంటే మా అందరికీ సంతోషమే గానీ నువ్వు యీ యింటి విషయాలు పట్టించుకోడం లేదంటే బాధగా ఉంది. ఆలోచించే జ్ఞానం నీకుంది. మాతో చెప్పించుకోడం ఏమంత మంచిదికాదు. తర్వాత నీ యిష్టం..... అన్నట్టు ఈ శుభ సమయంలో మీ ఆవిడకి ఒక మంచి బహుమానం ఆపిల్ల కిష్టమైనది యివ్వు. లేదూ—నువ్వు పైకమిస్తే మీ అన్నగారితో చెప్పి నేనే ఏదోఓటి కొనిస్తాను. అర్థ మయ్యిందా. సరె .... ముందు స్నానం చెయ్యి. వెళ్లు" అన్నది రాధమ్మ.

అతను వెళ్లిన తర్వాత భర్త నుద్దేశించి అన్నది.

"చూసేరా! అతని ప్రమోషను విషయంలో నాతో చెప్పడాని కెంత యిదై పోయేడో!"

"అవునవును. నీ సమయస్ఫూర్తికి మెచ్చుకోవచ్చు. వాడికి రెండు వడ్డించనూ వడ్డించావూ, లక్ష్మికొవలసిన బహుమానమూ ఏర్పాటు చేశావు. అలా ఉండాలి. దక్షతంటే" భార్య తెలివికి మురిసిపోయేడు రాఘవరావు.

—భోజనాలు ముగిశాయి.

అప్పటిగ్గాని రాజు అసలు సంగతి చెప్పలేదు—

"పుట్టి పెరిగిన ఊరునీ, మిమ్మల్నీ వదిలి దూరంగా వెళ్లాలంటే నాకు దిగులుగా ఉంది అమ్మాజీ!"

రాధమ్మ ఉలిక్కిపడ్డది.

"ఏమిట్రా నువ్వన్నది?" రాఘవరావు ఖంగారుగా అడిగేడు.

"ప్రమోషన్‌తోబాటు బదిలీ గూడా వచ్చింది. రాజ మండ్రి వేశారు." రాజు దిగులుగా చెప్పేడు.

ఆ రాత్రంతా అన్నదమ్ము లిద్దరూ ట్రాన్స్‌ఫర్ విషయమై మాటాడుకున్నారు. రాధమ్మ వాళ్ల మాటల్లో కలుగజేసుకోలేదు. ఆమె నొచ్చుకున్నది. ఏనాడూ లేనిది, యీరోజు వేరింటి కాపురం గురించి లక్ష్మితో చెప్పింది. తథాస్తు దేవత లుంటా రన్నది నిజమేనేమొ.

రాజు వెళ్లిపోతాడు. ఇది రాధమ్మ భరించగలదా?

రాజు ఒక్కడే రాజమండ్రి వెళ్లాడు. ఇల్లు కుదుర్చు కున్న తర్వాత లక్ష్మిని తీసుకెడతానని చెప్పేడు. అతను వెళ్ల బోయేముందు, ఇంటి గుమ్మం దిగి రాధమ్మ వైపు ఓ క్షణంపాటు చూసేడు. ఏమనుకున్నాడో ఏమో మళ్లా వెనక్కు తిరిగొచ్చి రాధమ్మ పాదాలకు నమస్కరించేడు. కళ్ల నిండా నీళ్లు నింపుకుని గాద్గదికంగా అన్నాడు—

"నన్ను క్షమించు అమ్మాజీ! .... వెళ్లొస్తాను."

'పిచ్చి తండ్రి—!'

అతని వినయాన్నీ, తనపట్ల అతనికి గల గౌరవ భావాన్నీ తలుచుకుంటూంటే రాధమ్మకి ఆనందంగా ఉంది.

అత నెక్కిన రైలు ఈసరికి కదిలి ఉంటుందని అనుకోగానే దుఃఖమూ పెల్లుబుకుతోంది.

మమకారం పెంచుకోకూడదు. కూడదు. అన్నింటికీ అతీతంగా బ్రతకాలి. చిత్రమైన తన యీ నిశ్చయానికి

వెంటనే సిగ్గుపడింది. కళ్ళు తుడుచుకుని లక్ష్మివైపు చూచింది. ఆపిల్ల కిటికీ దగ్గర కూర్చుని వేపచెట్టు వేపు చూస్తోంది. రేపు యీ లక్ష్మిని తీసుకుపోతాడు రాజా. సావిత్రి రెండేళ్ల క్రితమే వెళ్లిపోయింది. ఇక మిగిలేది—తనూ, బాబూ, వారు. బాబు కాలేజీకి, వారు ఆఫీసుకీ వెళ్లాలి. ఇంత ఇంట్లోనూ బిక్కు బిక్కు మంటూ ఒకర్తె సాయంత్రం వరకూ గడపాలంటే తనపాలిటి శిక్ష !

—రాజుని రైలెక్కించి వాళ్ళొచ్చారు కాబోలు. వీథిలో ఎవర్తోనో బిగ్గరగా మాటాడుతున్నారు. వెంటనే రాధమ్మ వీథిగుమ్మం దగ్గర కొచ్చి నిలబడ్డది. రాఘవరావు ఇంట్లోకొస్తో అన్నాడు—

"రాజు నా తమ్ముడు. లక్షకీ కోటికీ అలాటివాడు ఒక్క డుంటాడు. ఇదేమైనా గ్రహించావా నువ్వు. పైగా— వాడి గురించి నాకు ఫిర్యాదులు చేశావు. నాచేత గూడా వాడిని మాటనిపించావ్." రాఘవారావు ధోరణికి రాధమ్మ ఆశ్చర్య పోయింది.

"ఏమైం దిప్పుడు ?" కుతూహలంతో, అడిగింది.

"స్టేషన్లో రైలెక్కబోయేముందు అడిగేడు, 'వదినకి నామీద కోప మెందుకొచ్చిందీ' అని. నేను అన్ని విషయాలు చెప్పేను. వాడు బాధపడిపోతూ లేని నవ్వు మొహాన్న అంటిం చుకుని చెప్పేడు—ఈ ఏడాదిపాటూ ఇంట్లో డబ్బివ్వకపోడానికి కారణ మేమిటో తెలుసా ?"

".... .... ...."

"వాడికొచ్చే జీతాన్ని బేంక్‌లో దాస్తున్నాట్ట."

"దాచడమా ?" మరింత ఆశ్చర్యపోయింది రాధమ్మ.

"ఆ .... అక్షరాలా దాచడమే. వెయ్యి రూపాయిలు పోగుచేశాడు. శెట్టి అప్పు నెల రోజుల్లో ఫైసలు చేస్తా నన్నాడు. ఇప్పుడైనా వాడి బుద్ధి అర్థమయ్యిందా రాధా? వాడినా మనం అనుమానించడం ?"

"మరి .... మరీ విషయం మనతో చెప్పాడుగాదే యిన్నాళ్లూ."

"చెబితే—ఆ డబ్బుని మనం వాటికనీ, వీటికనీ, ముచ్చట్లూ, మురిపాలకనీ తగలేస్తామని వాడి భయంట. అంచేతే చివరికి లక్ష్మికి గూడా యీ రహస్యం చెప్పలేదుట. ఇక వెళ్ళు. తీరుబడిగా కూర్చుని వాడిని అవమానించినందుకు విచారించు. వెళ్ళు." రాఘవరావు విసురుగా తన గదిలోకి వెళ్లి పోయాడు.

ఇదంతా వింటూన్న లక్ష్మి కళ్లింతవి చేసుకుని రాధమ్మ వైపు చూచింది.

"అక్కా !" అన్నది బాధగా.

రాధమ్మ కొంగుతో కళ్లొత్తుకున్నది.

"నేను .... నేను చాలా మూర్ఖురాలిని అక్కా ! వారిని అపార్థం చేసుకున్నాను." అన్నది లక్ష్మి పశ్చాత్తాప పడుతూ—

"ఇన్నేళ్ళు పెంచిన నేనే రాజుని అర్థంచేసుకోలేక పోయాను" రాధమ్మ పేలవంగా నవ్వేస్తూ అన్నది.

---

క. కలదిందు ద్రాక్షతఱచుగ
కలపిట ముక్కంటిపండ్లు, కదళీఫలముల్
వలసిన వెల్లను జేకొనుఁ
డెలమి రసికులార! యలరుఁడీ కృతి తోటన్.

కాకొండ.

# జలాలుద్దీన్ రూమీ

శ్రీ ఎస్. సదాశివ

[క్రీ. శ. పం(దెండవ శతాబ్దియందు పారసీకభాషలో 'మస్నవీ' అను పేర సూఫీ మధురాద్వైత ప్రతిపాదకమగు విశ్వ విఖ్యాత మహాకావ్యము రచించిన మౌలానా జలాలుద్దీన్‌రూమ్ ఋషికల్పుడు. తొలుత అతడు విద్వాంసుడుగా, కవిగ, మాత్రమే విశ్రుతుడు. "షమ్స్ తబ్రీజ్" అను యోగిపుంగవుని వలన సూఫీ తత్త్వోపదేశముపొంది విరాగియై 'మస్నవీ' రచనచేసెను. మస్నవీరచనకు ప్రేరకుడు హిస్సాముద్దీన్.]

శ్రోతల మానసంబులు స్పృశించి, కదల్చి, రసాను భూతినే
కైత యొసంగు నయ్యదియెకైత; అదైనను నాత్మతత్త్వ వ్యా
ఖ్యాతమ యేని శ్రేష్ఠతమ, మట్లు కవిత్వము చెప్పునట్టి వి
ఖ్యాతకవీంద్రులే ఋషుల కారణబంధులు మానవాళికిన్.

పరమార్థ ప్రతిపాదకంబయిన దివ్యప్రేమ భావంబు నె
ల్లరకింపైన విధాన గాథలుగ బల్కం జాలినావెట్టి నే
ర్పరివో! ఎందరొ పారసీకమున గావ్యశ్రేణి నిర్మించి రం
దరలో శ్రేష్ఠుడవీవె రూమి సుకవీ! తత్త్వ ప్రభాభారవీ!

లౌకిక విద్యలందు విపులంబగు పాండితి పొందినట్టి సు
శ్లోకుడవీవు; శాస్త్రపరిశోధన జేయుచు శిష్యకోటికిన్
ప్రాకటలీల సంశయమువాపి ప్రబోధ మొసర్చువాడవో
యీ, కవిరాజ! నీకు దలయొగ్గని వాడపుడుండ నేర్చునే!

అంతటి నీశిరంబొకని యంఘ్రుల సన్నిధివంగె; చిత్త వి
భ్రాంతి తొలంగె; 'నేన'నెడి భావమశేషముగా నశించె; "ఈ
యంతయునొక్కటే మెదియు నన్యములేద"ను శుద్ధ తత్త్వమా
సాంతము భావవీథి గననయ్యె; పురాకృత పుణ్యమెట్టిదో!

చదివిన శాస్త్రముల సారమసారము; విద్యలెల్ల భ్రాం
తిదములు; లౌకికంబగు ప్రతిష్ఠ యహంతకు కారణంబు సం
పదలును బంధుజాలమును బంధనముల్ గురుపాద పద్మముల్
వదలని వారె ముక్తులపవారిత సంసృతి తాపు లెన్నగన్!